TEL : T/TG/2024/0814

# మన వెలుగు

ప్రతి వార్త ప్రజల వైపు    తెలుగు దినపత్రిక

MANA VELUGU TELUGU DAILY

## విలేఖరులు కావలెను...

మన వెలుగు తెలుగు దినపత్రికకు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోని అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు
మరియు నియోజకవర్గ,మండలవారిగా విలేఖరులు కావలెను,
తెలుగు భాష మీద కనీస అవగాహన కలిగివుండి, వార్తలు
రాయగలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును..
మరిన్ని వివరాలకు సంప్రదించండి...

నెట్ వర్క్ ఇంచార్జి సెల్ : 9533397954

సంపుటి : 01 సంచిక : 270 | బుధవారం , జూన్ 4, 2025 | పబ్లిషర్ హైదరాబాద్ | పేజీలు 5 | వెల-5

# జీ7 నుంచి భారత్‌కు రాని ఆహ్వానం..

## ఆరేళ్లలో తొలిసారి!




కెనడాలోని అల్బెర్టాలో ఈ నెల 15 నుంచి 17 వరకు జరగనున్న జీ7 సదస్సుకు భారత్‌కు ఇంకా ఆహ్వానం అందలేదు. దీంతో ఆరేళ్లలో తొలిసారి ఈ సదస్సుకు ప్రధాని మోదీ దూరంగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. భారత్-పాక్‌ల మధ్య మధ్యవర్తిత్వం చేయడానికి అమెరికాను అనుమతించిన తర్వాత ఇది మరో దౌత్యపరమైన భంగపాటేనని పేర్కొంది.

కెనడాలో జరగనున్న జీ7 సదస్సులో పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులు, రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న యుద్ధంతో పాటు ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లపైనా చర్చించే అవకాశం ఉంది. అయితే, ఈ సదస్సుకు ప్రధాని మోదీ హాజరయ్యే అవకాశం లేదని సన్నిహిత వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీకి ఇంకా ఆహ్వానం పంపలేదని తెలిసింది. ఒకవేళ ఆహ్వానం వచ్చినా.. ప్రస్తుతం ఇరుదేశాల మధ్య నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ప్రధాని మోదీ అక్కడికి వెళ్లకపోవచ్చనే వాదన ఉంది. దీంతో జీ7లో ప్రధాని మోదీ పాల్గొనకపోవడం ఆరేళ్లలో తొలిసారి అవుతుంది.

ఇదే అంశంపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. అమెరికా, ఫ్రాన్స్, బ్రిటన్, జపాన్, ఇటలీ, కెనడాతోపాటు జర్మనీ అధినేతలు జీ7 సదస్సులో పాల్గొననున్నారని, వీరితోపాటు బ్రెజిల్, మెక్సికో, దక్షిణాఫ్రికా, ఉక్రెయిన్, ఆస్ట్రేలియా దేశాధినేతలకు ఆహ్వానం అందిందని కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ జైరాం రమేశ్ వెల్లడించారు. 2014కు ముందుకు జీ8గా ఉండేదని, నాటి ప్రధాని మన్మోహన్‌కు అప్పట్లో ఆహ్వానం వచ్చేదన్నారు. 2014 తర్వాత ఈ సంప్రదాయం కొనసాగినప్పటికీ.. ఆరేళ్లలో తొలిసారి మన ప్రధానికి ఆహ్వానం అందలేదన్నారు. ఎలా చూసినా.. దౌత్యపరంగా ఇదో భంగపాటేనన్నారు.

ఇదిలాఉంటే, జీ7 దేశాల్లో భారత్ లేకున్నప్పటికీ.. నిర్వహణ దేశాల ఆహ్వానం మేరకు మన ప్రధాని ఆ శిఖరాగ్ర సదస్సుల్లో పాల్గొంటున్నారు. గతేడాది ఇటలీ వేదికగా జరిగిన సదస్సుకు భారత్‌తోపాటు ఆఫ్రికా, దక్షిణఅమెరికా, పలు అభివృద్ధి చెందుతున్న దేశాలు పాల్గొన్నాయి. ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ కూడా పాల్గొని తన గళాన్ని వినిపించారు.




- లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమిస్తారు.
- ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక VROని నియమిస్తారు.
- త్వరలోనే 3,556 మంది నియామకం జరుగుతుంది.
- భూములకు రెవెన్యూ అధికారి కాపలాదారుగా ఉంటారు.
- భూ భారతి చట్టం దేశానికి ఒక మాణిక్యం లాంటిది.
- వచ్చే ఆగస్టు నాటికి ధరణి నుండి విముక్తి కల్పిస్తాం.
- రాష్ట్రంలో 413 రెవెన్యూ గ్రామాల్లో నక్షలు లేవు.

మిగతాది 2లో

## పది ఫలితాల్లో మానుకోట టాప్



2 లో

# అత్యంత పారదర్శకంగా 'భూభారతి': డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ఖమ్మం: రైతులకు ఎంతో ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని జాగ్రత్తగా రూపకల్పన చేశామని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమాడులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ అత్యంత పారదర్శకంగా భూభారతి చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కొత్త చట్టాలపై రైతులకు అవగాహన కల్పిస్తూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు.

పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ మనుషులకు ఆధార్ లాగే భూములకు త్వరలో భూధార్‌ను తీసుకొస్తామని చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూభారతి చట్టం తెచ్చామన్నారు. లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి భూములను సర్వే చేయిస్తామని తెలిపారు. గ్రామాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి 3,500 మంది రెవెన్యూ అధికారులను నియమిస్తున్నామని పొంగులేటి చెప్పారు. 2లో..



»తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఖమ్మం జిల్లాలోని ములుగుమాడులో జరిగిన రెవెన్యూ సదస్సులో 'భూభారతి' చట్టం గురించి మాట్లాడారు.

»రైతులకు అత్యంత పారదర్శకంగా, ఉపయోగపడేలా 'భూభారతి' చట్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం






### పంచాయతీరాజ్‌శాఖ మంత్రి సీతక్క

- ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పథకంలో భాగంగా ములుగు జడ్పీ కార్యాలయ ఆవరణలో నమూనా ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించారు.
- రానున్న మేడారం మహాజాతర కోసం 135 కోట్ల పనులు చేపడుతున్నామని, ఇప్పటికే 35 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు.
- పర్యాటక అభివృద్ధిలో భాగంగా 6 కోట్లతో పలు జంక్షన్లలో సింబల్స్ ఏర్పాటు చేస్తున్నారు.
- 5 కోట్లతో మేడారంలోని జంపన్న వాగుపై సుందరీకరణ పనులు పూర్తి చేయనున్నారు.

మిగతాది 2లో

## 5న విచారణకు హాజరు కాలేను!



మరో గడువు ఇవ్వాలని కోరిన మాజీ సీఎం కేసీఆర్

2 లో

## డాలస్‌లో మహాత్ముడికి నివాళులర్పించిన కేటీఆర్

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది.



మిగతాది 2లో

## గోవధ నిషేధ చట్టం పటిష్టంగా అమలు చేయాలి: వీహెచ్‌పీ




మిగతాది 2లో

# సంపాదకీయం

## పాక్‌కు సింధు జలాలు... ఇంకానా

భారతదేశ సమగ్రతను, భారతీయుల ఆత్మగౌరవాన్ని కాపాడుకునేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్'.. మన సైనిక సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పింది. ఏప్రిల్ 22న పహల్గాంలో పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదుల ఉన్మాదానికి ప్రతీకారంగా.. మే 7వ తేదీ తెల్లవారుజామున (6వ తేదీ అర్ధరాత్రి తర్వాత), 9వ తేదీన పాకిస్థాన్‌లోని ఉగ్రవాద కేంద్రాలు లక్ష్యంగా సంధించిన మిసైళ్లు, పాక్ సైనిక స్థావరాలపై జరిపిన మెరుపుదాడులకు యావత్ ప్రపంచం సాక్షీభూతంగా నిలిచింది. 'ఆపరేషన్ సిందూర్' విషయంలో భారతదేశం చూపించిన పరిపక్వతకు, స్పష్టతకు యావత్ ప్రపంచం జేజేలు పలికింది. బ్రహ్మోస్, స్కాల్ప్ మిసైళ్లను వాడుతూ.. ఎస్%-%400, ఆకాశ్ ద్వారా వైమానిక రక్షణ వ్యవస్థతో స్వీయరక్షణ చేసుకుంది.

పహల్గాం ఘటన జరిగిన మూడురోజుల లోపే సింధుజలాల ఒప్పందాన్ని నిలిపేస్తున్నట్లు భారతదేశం చాలా స్పష్టంగా తెలియజేసింది, కఠినంగా వ్యవహరించింది. 'ఆపరేషన్ సిందూర్'కు తాత్కాలిక విరామం ఇస్తూ.. కాల్పుల విరమణకు అంగీకరించిన సందర్భంలోనూ 'సింధు జలాల ఒప్పందం' నిలుపుదలపై యథాతథస్థితిని కొనసాగించింది. 1965, 1971 (బంగ్లాదేశ్ ఏర్పాటు సందర్భంగా), 1999 (కార్గిల్), 2001 (పార్లమెంటుపై దాడి), 2008 (ముంబైపై ఉగ్రదాడి), 2016 (యురీ), 2019 (పుల్వామా) ఘటనల సందర్భంలోనూ భారత్, పాక్ మధ్య తీవ్రస్థాయిలో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నప్పటికీ సింధునదీ జలాల ఒప్పందంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. కానీ పహల్గాం ఉగ్రదాడి తర్వాత, దేశవ్యాప్తంగా ఉద్విగ్న వాతావరణం నెలకొనడం, ఇరుదేశాల మధ్య సంబంధాలు పూర్తిగా క్షీణించిన సందర్భంలో మోదీ సర్కారు సింధు జలాల ఒప్పందాన్ని నిలిపివేస్తూ గొప్ప నిర్ణయం తీసుకుంది.

భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తొలినాళ్లలో జరిగిన ఓ చారిత్రక తప్పిదమే ఈ సింధు జలాల ఒప్పందం. నాటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ, నాటి పాక్ అధ్యక్షుడు జనరల్ అయూబ్ ఖాన్ 19 సెప్టెంబర్ 1960లో సద్భావనాపూర్వక ఒప్పందంగా దీనిపై సంతకాలు చేశారు. సింధు జలాల ఒప్పందం (ఇండస్ వాటర్ ట్రీటీ)లో భాగంగా.. సింధు నది, దాని అయిదు ఉప నదుల జలాల్లో.. 80 శాతం పాకిస్థాన్, 20 శాతం భారత్ వినియోగించుకోవాలి. పాకిస్థాన్‌కు సింహభాగం నీటిని అప్పగిస్తున్నందుకు బదులుగా రావి, బియాస్, సట్లేజ్ నదుల నీటిని భారత్, సింధు, జీలం, చీనాబ్ నదుల నీటిని పాకిస్థాన్ వినియోగించుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు.

రావి, బియాస్, సట్లేజ్ నదుల నీటిని భారత్ వాడుకుంటున్నందున.. పాకిస్థాన్ భూభాగంలో ఈ నదీ పరివాహక ప్రాంతంలో జీలం, సింధు, చీనాబ్ నదులకు లింక్ కెనాళ్ల నిర్మాణ ఖర్చులుగా రూ.83.3 కోట్లను భారతదేశం భరించాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఇది రూ.8వేల కోట్లతో సమానం. ఆ తర్వాత ప్రపంచ బ్యాంకు జోక్యంతో పాకిస్థాన్‌కు మరో రూ.400 కోట్ల నిధులు అందాయి. అదే సమయంలో భారతదేశం.. కెనాళ్ల నిర్మాణానికి రూ.100 కోట్ల సొంత నిధులను ఖర్చు చేసుకోవాలని ఒప్పందంలో పేర్కొన్నారు. ఇందుకోసం భారత్‌కు ప్రపంచబ్యాంకు కేవలం రూ.30కోట్ల నిధులను ఇచ్చింది. అది కూడా రుణంగానే. ఈ ఒప్పందం పాకిస్థాన్‌కు అనుకూలంగా ఎంత ఏకపక్షంగా సాగిందో చెప్పేందుకు ఇదొక ఉదాహరణ మాత్రమే. ఈ ఒప్పందంపై నెహ్రూ సంతకం చేయడంపై అప్పుడే కాంగ్రెస్ నాయకులతో పాటు దేశవ్యాప్తంగా బహిరంగంగా అసంతృప్తి వ్యక్తమైంది. 30 నవంబర్, 1960 నాడు.. సింధుజలాల ఒప్పందంపై పార్లమెంటులో చర్చ సందర్భంగా.. కాంగ్రెస్ ఎంపీ హరీశ్‌చంద్ర మాథుర్ మాట్లాడుతూ.. టైమ్స్ ఆఫ్ ఇండియాలో వచ్చిన కథనాన్ని ప్రస్తావిస్తూ.. 'ఈ ఒప్పందంలోని ప్రతి అంశం వివాదాస్పదమే. పాకిస్థాన్ ఆకాంక్షలను పూర్తి చేసేందుకు భారతదేశం తన ప్రయోజనాలను పణంగా పెట్టి మరీ డబ్బులు వెచ్చిస్తోంది' అని గుర్తు చేశారు. నాటి వాస్తవ పరిస్థితిని హరీశ్‌చంద్ర మాథుర్ మాటలు కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నాయి. దీనికితోడు భారత్, పాకిస్థాన్, ప్రపంచ బ్యాంకు మధ్య జరిగిన ఈ త్రైపాక్షిక ఒప్పందానికి భారతదేశమే చాలా రాయితీలు ఇచ్చింది. అందుకు ప్రతిఫలంగా మనకేమీ

## ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ

- పేదవారి సొంతింటి కల నెరవేర్చిన కాంగ్రెస్ ప్రభుత్వం
- పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అనునిత్యం కృషి చేస్తుంది
- కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు

మెట్ పల్లి / ఇబ్రహీంపట్నం (మన వెలుగు) జూన్ 03 :



మండలం బండలింగాపూర్ మరియు జగ్గాసాగర్ గ్రామంలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని ఇందిరమ్మ కమిటీ మెంబర్లతో కలిసి కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు అర్హులైన లబ్ధిదారులకు పట్టాలు పంపిణీ చేయడం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం పేద ప్రజల అభివృద్ధి సంక్షేమం కోసం అనునిత్యం కృషి చేస్తుందని ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పేద ప్రజల సొంతింటి కల సహకారం చేయడం కోసమే ఇందిర మైండ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం అన్నారు అందులో భాగంగానే అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్ల పట్టాలను పంపిణీ చేయడం జరుగుతుందన్నారు గత బిఆర్ఎస్ ప్రభుత్వం 10 సంవత్సరాలలో అధికారంలో ఉండి కనీసం గ్రామానికి 10 ఇండ్లను కూడా మంజూరు చేయలేక పోయిందని కానీ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 18 నెలల వ్యవధిలోనే సుమారు ఒక గ్రామానికి జనాభా ప్రాతిపదికన అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరుగుతుందన్నారు అలాగే పేదవారు కూడా సన్న బియ్యం తో కడుపునిండా తినాలని సంకల్పంతో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం రేషన్ కార్డుదారులం దరికీ రేషన్ దుకాణాల ద్వారా సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని కొనసాగిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో బ్లాక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి,తిప్పిరెడ్డి అంజిరెడ్డి,మాజీ జెడ్పిటిసి ఆకుల లింగారెడ్డి నాయకులు జంగిటి రాజేందర్,జంగస్వామి,మారు ప్రతాప్,మాకల తుకారాం,దేవస్థానం చైర్మన్ రామాంజ జరెడ్డి,పిడుగు తిరుపతి,కోరం నవీన్,రవి,పుప్పాల గంగాధర్,లింగారెడ్డి,రవీందర్ తదితరులు పాల్గొన్నారు

## 5న విచారణకు హాజరు కాలేను!

మొదటిపేజీ తరువాయి

కాళేశ్వరం బ్యారేజీల్లోని అవకతవకలపై విచారణ చేస్తున్న కమిషన్ ఎదుట ఈ నెల 5న హాజరు కాలేనంటూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కమిషన్‌కు విన్నవించారు. మరో తేదీన వస్తానని, గడువు ఇవ్వాలని కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్‌ను కోరారు. దీంతో కమిషన్ సానుకూలంగా స్పందించి... ఈ నెల 11న రావాలని సూచించింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలపై న్యాయ విచారణ చేస్తున్న జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మే 19న మాజీ సీఎం కేసీఆర్, నాటి మంత్రులు ఈటల రాజేందర్(ఆర్థిక), తన్నీరు హరీశ్‌రావు(నీటిపారుదల)లకు నోటీసులు పంపింది. 5న కేసీఆర్, 6న ఈటల, 9న హరీశ్‌రావులు హాజరుకావాలని సూచించింది. ఈ క్రమంలో కమిషన్ ఎదుట హాజరై తమ బాణీ వినిపించేందుకు కేసీఆర్, హరీశ్‌రావులు సన్నద్ధమయ్యారు. ఒకటికి రెండుసార్లు వారిద్దరూ సమావేశమై విచారణలో వివరించాల్సిన అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ఇంతలో కేసీఆర్ విచారణకు మరో తేదీని కోరారు.

మరోవైపు కాళేశ్వరం విశిష్టతను పార్టీ శ్రేణులకు, ప్రజలకు తెలియజేయాలని భారాస నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా మీడియాకు తెలంగాణభవన్‌లో హరీశ్‌రావు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చేందుకు నిర్ణయించగా చివరి సమయంలో వాయిదా వేశారు.

రేపు హైదరాబాద్‌కు జస్టిస్ ఘోష్: కమిషన్ ఛైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ బుధవారం సాయంత్రం కోల్‌కతా నుంచి హైదరాబాద్‌కు చేరుకోనున్నారు. ఐదు నుంచి మలిదశ విచారణ ప్రక్రియను ప్రారంభించనున్నారు.

## డాలస్‌లో మహాత్ముడికి నివాళులర్పించిన కేటీఆర్

మొదటిపేజీ తరువాయి

భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అమెరికా పర్యటన కొనసాగుతోంది. దీనిలో భాగంగా డాలస్‌లో అమెరికాలోనే అతి పెద్దదైన మహాత్మాగాంధీ విగ్రహాన్ని సందర్శించారు. అక్కడ పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ అహింస, సత్యాగ్రహమే ఆయుధాలుగా భారతీయులందరినీ గాంధీ సమాయత్తం చేశారన్నారు. బ్రిటిష్ బానిస సంకెళ్ల నుంచి దేశాన్ని విడిపించి స్వాతంత్ర్యం తీసుకొచ్చేందుకు కృషి చేశారని కొనియాడారు. అందుకే ప్రపంచవ్యాప్తంగా నేటికీ గాంధీని ప్రశంసిస్తూనే ఉంటారని చెప్పారు. అలాంటి విశ్వనాయకుడి విగ్రహాన్ని ఇంత పెద్ద ఎత్తున డాలస్ (ఇర్వింగ్)లో నెలకొల్పడంలో మహాత్మాగాంధీ మెమోరియల్ ఆఫ్ నార్త్ టెక్సాస్ వ్యవస్థాపక అధ్యక్షులు డా.ప్రసాద్ తోటకూర, కార్యవర్గ సభ్యుల కృషిని కేటీఆర్ అభినందించారు. అనంతరం ఆ సంఘం వ్యవస్థాపక కార్యదర్శి రావు కల్వాల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనకు, దశాబ్దకాలం పాటు రాష్ట్ర అభివృద్ధికి మాజీ సీఎం కేసీఆర్, కేటీఆర్, వారి కుటుంబసభ్యులు చేసిన కృషి, త్యాగాలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని చెప్పారు. గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం కోసం కేసీఆర్ మార్గనిర్దేశంలో కేటీఆర్ ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. కేసీఆర్ విజన్ తెలంగాణకు ఒక గళాన్ని ఇచ్చిందన్నారు.

డా.ప్రసాద్ తోటకూర మాట్లాడుతూ అమెరికాలో అతి పెద్దదైన గాంధీ స్మారకస్థలిని నిర్మించి 10 సంవత్సరాలు పూర్తయిందన్నారు. ఈ నిర్మాణం ప్రవాస భారతీయుల సమష్టి కృషి, ఐకమత్యానికి నిదర్శనమని చెప్పారు. దీన్ని సాకారం చేసేందుకు అనుమతులు ఇచ్చిన నగర అధికారులు, దాతలు, కార్యవర్గ సభ్యులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా డాలస్ సందర్శనకు వచ్చినవారు ఈ గాంధీ స్మారకస్థలిని సందర్శిస్తూనే ఉన్నారని చెప్పారు. అనంతరం కేటీఆర్‌ను బోర్డు సభ్యులు రావు కల్వాల, బీఎన్ రావు, తైయాబ్ కుండావాలా, మురళి వెన్నం, రాజేంద్ర వంకావాలా, అనంత్ మల్లవరపు, వినోద్ ఉప్పు, షబ్నం మాడ్గిల్‌తో కలిసి డా.ప్రసాద్ తోటకూర ఘనంగా సన్మానించారు. వందలాది ప్రవాస భారతీయులు హాజరయ్యారు.

ఈ కార్యక్రమంలో కోపెల్ సిటీ కౌన్సిల్ మెంబర్ రమేశ్ ప్రేమ్ కుమార్, ఎన్ఆర్ఐ భారాస అమెరికా విభాగం అధ్యక్షుడు తన్నీరు మహేశ్, ఎన్ఆర్ఐ భారాస గ్లోబల్ కన్వీనర్ బిగాల మహేశ్, నేతలు ఎల్.రమణ, తాతా మధు, గ్యాదరి బాలమల్లు, నవీన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కల్వకుంట్ల సంజయ్, పాడి కౌశిక్‌రెడ్డి, కర్నె ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి, బాల్క సుమన్, గువ్వల బాలరాజు, గండ్ర వెంకటరమణారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పెద్ది సుదర్శన్‌రెడ్డి, చల్లా ధర్మారెడ్డి, గాదరి కిశోర్, క్రాంతి కిరణ్, పైలట్ రోహిత్‌రెడ్డి, కోరుకంటి చందర్, నోముల భగత్, బానోతు చంద్రావతి, గండ్ర జ్యోతి, దామోదర్, జాన్సన్ నాయక్, అమరేందర్‌రెడ్డి, రఘువీర్‌సింగ్, యుగంధర్‌రావు, విష్ణువర్ధన్‌రెడ్డి, అభిలాష్ రంగినేని, సోమ ఉపేందర్‌రెడ్డి, వంశీరెడ్డి, అరవింద్‌రావు తక్కెళ్లపల్లి తదితరులు పాల్గొన్నారు.

## గోవధ నిషేధ చట్టం పటిష్ఠంగా అమలు చేయాలి: వీహెచ్‌పీ

మొదటిపేజీ తరువాయి



దేశంలో గోవధ నిషేధ చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయాలని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) పిలుపునిచ్చింది. అక్రమంగా నిర్బంధించిన గోవులను విడిపించి గోశాలలకు తరలించేందుకు సోమవారం వీహెచ్‌పీ చేపట్టిన 'ఆపరేషన్ గోమాత..చలో పాతబస్తీ' కార్యక్రమం ఉద్రిక్తంగా మారింది. వీహెచ్‌పీ రాష్ట్ర కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ఆపరేషన్ గోమాత కార్యక్రమంలో వీహెచ్‌పీ అధికార ప్రతినిధి రావినూతల శశిధర్, గోరక్ష విభాగ్ ప్రాంత ప్రముఖ్ రమేశ్‌జీ, బజరంగ్‌దళ్ పూర్వ అధ్యక్షుడు సుభాష్ చందర్, అఖిల భారత గోశాల ఫౌండేషన్ అధ్యక్షుడు బాలకృష్ణ గురుస్వామి, తెలంగాణ గోశాలల అధ్యక్షులు విజయరామ్ మాట్లాడుతూ..రాష్ట్రంలో గోవధ జరుగుతోందని, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెక్‌పోస్టులను దాటుకుని నగరానికి గోవులు ఎలా చేరుకున్నాయని ప్రశ్నించారు. ఈ విషయంలో పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సుల్తాన్‌బజార్ ఎస్సై మధుసూదన్ ఫిర్యాదు మేరకు పోలీసుల విధులకు ఆటంకం కలిగించారనే ఆరోపణలపై వీహెచ్‌పీ ప్రతినిధులపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ నరసింహా పేర్కొన్నారు.

## అత్యంత పారదర్శకంగా 'భూభారతి': డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

మొదటిపేజీ తరువాయి

మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విప్లవాత్మక చట్టాన్ని తమ ప్రభుత్వం తెచ్చిందన్నారు. దశాబ్దాలుగా ప్రభుత్వాలు ఎన్ని చట్టాలు తెచ్చినా.. భూముల సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. భూభారతితో రైతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు.

## ప్రతి రైతుకు భూదార్ నంబర్ ఇస్తాం. .మీ భూములకు కాపాలదారుగా వీఆర్వోను పెడ్తం: పొంగులేటి

మొదటిపేజీ తరువాయి

ప్రతి రైతుకు ఒక భూధార్ నెంబర్ ఇస్తామన్నారు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి. ఖమ్మంలో భూ భారతి రెవెన్యూ సదస్సులో మాట్లాడిన ఆయన..ఈ రోజు నుంచి అధికారులే ప్రతి రెవెన్యూ విలేజ్ లో మీ ఇంటికి వచ్చి సర్వే చేస్తారని చెప్పారు. రైతులు ఏ కార్యాలయం చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రైతు కు ఒక్క భూధార్ నెంబర్.. లైసెన్స్ సర్వేయర్ లను ఇస్తాం. అలాగే ప్రతి రెవెన్యూ విలేజ్ కి ఒక్క విఆర్ఓను ఇస్తామని చెప్పారు. త్వరలోనే 3,556 మంది నియామకం జరగనుందన్నారు. భూములకు రెవెన్యూ అధికారి కాపలా దారుడిగా ఉంటారని చెప్పారు.

దేశానికి మాణిక్యం వంటి చట్టం భూ భారతి. దేశ వ్యాప్తంగా సర్వే చేసి ఈ పథకం తీసుకొచ్చాం. ఒక్క చట్టం అమలు చేసేటప్పుడు ముందుగా దాని విశ్లేషణ కోసం నాలుగు మండలాలు పైలెట్ ప్రాజెక్ట్ గా తీసుకున్నాం. దేశానికి ఆగస్టు 15 న స్వాతంత్రం వచ్చిన విధంగానే వచ్చే ఆగస్టు నాటికి ధరణి నుంచి విముక్తి కల్పిస్తాం. మీ సమస్యలు అన్ని పరిష్కారం అవుతాయి . రాష్ట్రంలో 413 రెవెన్యూ గ్రామాల్లో నక్షలు లేవు. అయిదు గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్ లుగా అయిదు సంస్థలకు ఇచ్చాం. గత ప్రభుత్వంలో మాదిరిగా ఒక్కరికే ఇవ్వలేదు. ములుగుమాడుకు ఒక్క నక్ష తయారు చేసి ఇస్తాం.

రాష్ట్ర వ్యాప్తంగా భూమి లేకుండా ఉన్నట్లుగా చిత్రికరించారు గత ప్రభుత్వం నేతలు. రైతు బందు కోసం పెద్దల సహకారంతో అక్రమాలు చేశారు. ధరణి పేరుతో అక్రమంగా ఆనాడు ఇందిరమ్మ పేరుతో పేదలకు ఇచ్చిన భూములను తారు మారు చేశారు. భూభారతి రిజిస్ట్రేషన్ వ్యవస్థలో కూడా మార్పులు చేస్తున్నాం. స్లాట్ బుకింగ్ పెట్టి పారదర్శగా చేస్తున్నాం. గత ప్రభుత్వం చేపట్టిన అన్ని సంక్షేమ పథకాలు ఇస్తూ కొత్త పథకాలు ఇస్తున్నామని చెప్పారు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.

## పది ఫలితాల్లో మానుకోట టాప్

మొదటిపేజీ తరువాయి

మహబూబాబాద్, వెలుగు: ఇటీవల విడుదలైన పది పరీక్ష ఫలితాల్లో మానుకోట టాప్‌లో నిలవడం సంతోషాన్నిచ్చిందని, ఇదే స్థాయిలో జిల్లాను అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపడానికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ అన్నారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన రాష్ట్ర ఆవతరణ వేడుకల్లో ఆయన పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించి, మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాలో ఈ ఏడాది 3634 మంది లబ్ధిదారులకు రూ.36,4 ,58,144 మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం రైతులకు విత్తనాల పంపిణీ చేపట్టారు. మహబూబాబాద్ఎమ్మెల్యే భూక్య మురళీ నాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఎస్పీ సుధీర్ రామ్ నాథ్ కేకన్, అడిషనల్‌కలెక్టర్ కె.వీర బ్రహ్మాచారి తదితరులు పాల్గొన్నారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు : మంత్రి సీతక్క



మొదటిపేజీ తరువాయి

ములుగు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక నిధులను కేటాయించామని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగులోని తంగేడు స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కలెక్టర్ దివాకర, ఎస్పీ పి.శబరీష్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌బానోతు రవిచందర్, అడిషనల్ కలెక్టర్ సంపత్ రావుతో కలిసి జాతీయ జెండా ఆవిష్కరించారు. అనంతరం ప్రగతి నివేదిక వినిపించారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు పథకంలో భాగంగా ములుగు జడ్పీ కార్యాలయ ఆవరణంలో నమూనా ఇందిరమ్మ ఇల్లును మంత్రి సీతక్క ప్రారంభించారు.

ఆ తర్వాత ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ రానున్న మేడారం మహాజాతరకు రూ.135 కోట్లతో పనులు చేపడుతున్నామని, ఇప్పటికే రూ.35 కోట్లతో రోడ్డు నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. పర్యాటక అభివృద్ధిలో భాగంగా రూ.6 కోట్లతో పలు జంక్షన్లలో సింబల్స్ ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. రూ.5 కోట్లతో మేడారంలోని జంపన్న వాగుపై సుందరీకరణ పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలో రూ.కోటిన్నరతో, ఏటూరు నాగారం మండల కేంద్రంలో రూ.కోటితో కూరగాయల మార్కెట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. నూతన కలెక్టర్ భవన నిర్మాణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా ఆయుష్ మంత్రిత్వ శాఖ నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన

## సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా పనిచేయాలి






**- అధికారులతో సమన్వయ సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
సీజనల్ వ్యాధుల నియంత్రణే లక్ష్యంగా అంకితభావంతో కృషి చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని తన ఛాంబర్లో సంబంధిత అధికారులతో అదనపు కలెక్టర్ మంగళవారం సమన్వయ సమావేశం నిర్వహించా రు. జిల్లాలో ఎక్కడ కూడా డెంగీ, చికున్ గున్యా, మలేరి యా, టైఫాయిడ్, విషజ్వరాలు వంటి వ్యాధులు ప్రబలకుం డా క్షేత్రస్థాయిలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా డెంగీ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని అన్నారు. పారిశుధ్య పనులు పక్కాగా జరిగేలా నిరంతరం పర్యవేక్షణ చేయాలని, దోమల నివారణకు అన్ని నివాస ప్రాంతాలలో ఫాగింగ్ చేయించాలని, నిలువ నీరు ఉన్న చోట, మురుగు కాలువలలో ఆయిల్ బాల్స్ వేయాలన్నారు. రోజువారీగా పీ.హెచ్.సీ ల నుండి సీజనల్ వ్యాధులకు సంబంధించిన కేసుల నమోదు వివరాలను తెప్పించుకుని, ఎక్కడైనా డెంగీ కేసులు నమోదైతే చుట్టుపక్కల అన్ని నివాస గృహాల వద్ద నియంత్రణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దోమల నివారణ మందులను గ్రామపంచాయితీలలో అందుబా టులో ఉంచుకోవాలని, వారానికి కనీసం రెండు పర్యా యాలు తప్పనిసరిగా పిచికారీ చేసేలా చర్యలు తీసుకో వాలని సూచించారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న దృష్ట్యా అన్ని పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ బడులలో దోమల నివారణ చర్యలు చేపట్టాలని, పారిశుధ్య సమస్యలు లేకుండా చూడాల న్నారు. రానున్న రోజులలో సీజనల్ వ్యాధులు మరింతగా ప్రబలేందుకు ఆస్కారం ఉన్నందున అప్రమత్తతో కూడిన చర్యలు చేపట్టాలని హితవు పలికారు. ఎక్కడ కూడా తాగునీరు కలుషితం కాకుండా నీటి సరఫరాను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అన్ని నివాస గృహాలు, సంస్థలలో వారంలో రెండు రోజులు డ్రై డే నిర్వహించేలా చూడాలని, నిలువ నీటిని ఖాళీ చేయించి, దోమలు వ్యాప్తి చెందకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నివాస గృహాలు, పరిసరాలలో చెత్తా చెదారం పేరుకుపోకుండా రోజువారీగా శుభ్రం చేయించాలని, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సీజనల్ వ్యాధుల నిర్ధారణ కోసం ప్రజలు రాపిడ్ టెస్టులు చేయించుకునేందుకు వీలుగా టోల్ ఫ్రీ నెంబర్ 9390653962 ను సంప్రదించవచ్చని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కట్టుదిట్టంగా వ్యవహరించాలని సూచించారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఇనుగుర్తి మండల కేంద్రంలో డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ





**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ డోర్నకల్ శాసనసభ్యులు డా. జాటోత్ రామచంద్రనాయక్, మహబూబాబాద్ శాసనసభ్యులు డా. భూక్యా మురళీ నాయక్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తక్కలపల్లి రవీందర్ రావు మాజీ ఎంఎల్ఏ శంకర్ నాయక్,మాజీ ఎంపీ మాలోత్ కవితలు పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు.అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడు తూ..భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు నాంది పలికిన రాజ్యాంగాన్ని రచించిన బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం నా జీవితంలో ఒక గౌరవంగా భావిస్తున్నా ను. ఆయన రాసిన రాజ్యాంగం పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు.విగ్రహ నిర్మాణానికి సహక రించిన దాతలందరికీ, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసారు.కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీయబోతున్న వేళ, అంబేద్కర్ ఆశయాలను కాపాడేందుకు కాంగ్రెస్ పార్టీ 'జై బాపూ, జై భీమ్, జై సంవిధాన్' నినాదంతో రాజ్యాంగ పరిరక్షణ యాత్ర చేపట్టింది.డా. అంబేద్కర్ అణగారిన వర్గాలకు ఆశాకిరణం గా నిలిచిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. కార్యక్ర మంలో మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి, జిల్లా నాయ కులు, మండల నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం

**- రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యం**
**- ఏవో మహేష్ చంద్ర చటర్జీ**



**పినపాక (మన వెలుగు) జూన్ 03 :**
అశ్వాపురం : పంట సాగులో నాణ్యమైన విత్తనం యొక్క పాత్రను గుర్తించి, ప్రొ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయం ఈ సంవత్సరం "నాణ్యమైన విత్తనం - రైతన్నకు నేస్తం అనే వినూత్న కార్యక్రమాన్ని చేపట్టిం ది.అందులో భాగంగా మంగళవారం అశ్వాపురం మండల వ్యవసాయ అధికారి మహేష్ చంద్ర చటర్జీ మండలంకు సంబంధించి 11 రెవెన్యూ గ్రామాలకు సంబంధించి అశ్వాపురం రైతు వేదికలో విత్తన పంపిణీ కార్యక్రమం ప్రారంభించారు ఈ సందర్భంగా ఏవో మహేష్ చంద్ర చటర్జీ మాట్లాడుతూ...ఈ కార్యక్రమం యొక్క ప్రధాన ఉద్దేశ్యం రైతులందరికీ నాణ్యమైన విత్తనాలు అందించడమే లక్ష్యంగా ప్రతి పంటలో నాణ్యమైన విత్తనాన్ని వాడితేనే దిగుబడులు కనీసం 10-15 శాతం వరకు పెరిగే అవకాశం ఉందని రైతులందరికీ ఈ విషయం తెలియజేయడం. రైతులు ఒకసారి నాణ్యమైన విత్తనాన్ని వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా సేకరించి, కొన్ని సాగు సాంకేతిక తలను పాటిస్తే అదే విత్తనాన్ని 2-3 సంవత్సరాల వరకు వాడుకోవచ్చు ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని ప్రతి రెవెన్యూ గ్రామంలో ఎంపికైన ముగ్గురు నుండి ఐదుగురు అభ్యుదయ రైతులకు వ్యవసాయ పరిశోధన స్థానాల ద్వారా ఉత్పత్తి చేసిన నాణ్యమైన విత్తనం అందించబడుతుంది. ఎంపికైన రైతులకు విత్తనోత్పత్తిపై వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు ఎప్పటికప్పుడు అందించబడతాయి అన్నారు ఈ పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు మరియు వ్యవసాయశాఖ మంత్రివర్యులు శ్రీ తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో జూన్ 2వ తేదీన గౌరవ ముఖ్యమంత్రి చేతుల మీదుగా పినపాక నియోజక వర్గం లో శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అధికారికంగా ప్రారంభించబడింది.అని ఈ విధంగా విత్తన సాంకేతికతను గ్రామ స్థాయికి తీసుకెళ్లడం ద్వారా, రానున్న 2-3 సంవత్సరాలలో ప్రతి గ్రామం విత్తన స్వయం సమృద్ధిని సాధించడమే కాక, తెలంగాణ రాష్ట్రాన్ని విత్తన భద్రతలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో ఈ కార్యక్రమం ముందుకు సాగుతుంది తెలిపారు. కార్యక్రమం లో మండల వ్యవసాయ విస్తరణ అధి సౌమ్య, రమాదేవి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా హరీష్ రావు జన్మదిన వేడుకలు

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 03 :**
మాజీ మంత్రివర్యులు సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు జన్మదిన సందర్భంగా మంగళవారం పట్టణంలో కోరుట్ల నియోజకవర్గం బిఆర్ఎస్ నేత ఓజ్జల శ్రీనివాస్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ చరణ్ దానవీని గంగారాజం స్వరాజ్ పసునూరి అరుణ్ శేఖర్ క్రాంతి శ్రీధర్ ప్రవీణ్ తదితరులు యువజన నాయకుడు పాల్గొన్నారు.



## ప్రెస్టేజ్ ఆసుపత్రి వైద్యులు రోగికి జీవం ప్రసాదించారు





**- ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యురాలు డాక్టర్ ప్రతిమ రాజ్, నెఫ్రాలజీ వైద్యులు మోసిన్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
నిజామాబాద్ నగరంలోని ప్రెస్టేజ్ ఆసుపత్రి వైద్యులు రోగికి జీవం ప్రసాదించారు. మంగళవారం ప్రెస్టేజ్ ఆసుపత్రిలో ప్రముఖ క్రిటికల్ కేర్ వైద్యురాలు డాక్టర్ ప్రతిమ రాజ్, నెఫ్రాలజీ వైద్యులు మోసిన్ లు మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఎడపల్లి మండలం కుర్నపల్లి గ్రామానికి చెందిన నవీన్ (35) శరీరంలోని ప్రధానమైన అవయవాలైన కిడ్నీ, లివరు, ఊపిరితిత్తులు, గుండె, నాడీ వ్యవస్థ పనిచేయకపోవడంతో ఆసుపత్రికి తీసుకువచ్చారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న మనిషి ఒకేసారి చావు బతుకుల మధ్యకు పోవడంతో కుటుంబసభ్యులు చివరి నిమిషంలో ప్రెస్టేజ్ ఆసుపత్రికి తీసుకొచ్చారన్నారు. ఆసుపత్రి వైద్యులు రోగి చికిత్స పట్ల ప్రత్యేకంగా శ్రద్ధ చూపి సకాలంలో వైద్యం అందించి రోగి ప్రాణాలు కాపాడారు.. వైద్యులు అందించిన సేవల పట్ల రోగి కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. లక్షల్లో ఒకరికి మాత్రమే నరాల బలహీనతకు సంబంధించిన గులియం బ్యారీ సింద్రోమ్ అనే వ్యాధి సోకుతుందని నవీన్ అనే పేషెంట్ కు ఈ వ్యాధి సోకడం విచారకరమన్నారు. గుండె కిడ్నీ నరాల బలహీనత వంటి ప్రధానమైన అవయవాలతో బాధపడుతున్న నవీన్ కు మెరుగైన వైద్య చికిత్సలు అందించారు. డయాలసిస్తో కిడ్నీ ఫంక్షనింగ్ చేయడంతో పాటు నరాల బలహీనత, హార్ట్ ,కిడ్నీ, లివర్ ఫంక్షన్ ను మెరుగుపరచామని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో పూర్తి ఆరోగ్యంతో మంగళవారం సాయంత్రం డిశ్చార్జ్ చేశామని ప్రతిమ రాజ్ తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో ఆసుపత్రి వైద్యులు వినోద్,డైరెక్టర్ కైఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి





**- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
భూ సమస్యల శాశ్వత పరిష్కారం కోసం ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. డిచ్పల్లి మండలం సుద్దులం, దర్పల్లి మండలం గోవింద్ పల్లి గ్రామాలలో మంగళవారం నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సులలో కలెక్టర్ పాల్గొన్నారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. భూ భారతి చట్టంలోని అంశాలను వివరిస్తూ, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. భూ సమస్యలు పరిష్కరించి, రైతులకు వారి భూములపై పూర్తి హక్కులు కల్పించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం అమలు చేస్తోందని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే మెండోరా మండలంలో పైలెట్ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు జరిపి, క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశామని అన్నారు. ప్రస్తుతం జిల్లాలోని మిగతా 32 మండలాల్లో గల అన్ని రెవెన్యూ గ్రామాలలో ఈ నెల 20వ తేదీ వరకు సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిం చామని తెలిపారు. తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్ల నేతృత్వంలో రెండు బృందాలను నెలకొల్పి, ప్రతి రోజు ప్రతి మండలంలో రెండు గ్రామాలలో రెవెన్యూ సదస్సులు జరిపేలా చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. భూ రికార్డులలో పేరు తప్పులు,విస్తీర్ణం హెచ్చు తగ్గులు, వార సత్వ భూములు, భూ స్వభావం తప్పులు, నిషేధిత జాబితాలో ఉన్న భూ సమస్యలు, సర్వే నెంబర్ మిస్సింగ్, పట్టా పాస్ బుక్కులు లేకపోవడం, ప్రభుత్వ భూములను నవీకరించడం, సాదాబైనామా కేసులు, హద్దుల నిర్ధారణ, పార్ట్-బి లో చేర్చిన భూముల సమస్యలు, భూసేకరణ కేసులు తదితర భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు సదస్సులలో స్వీకరించి భూభారతి కొత్త చట్టం ప్రకారం అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి, నిర్దేశిత గడువు లోపు సమస్యలను పరిష్కరించడం జరుగు తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ఆగస్టు 14వ తేదీ లోపు భుభారతి కింద వచ్చిన అన్ని అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరిస్తామని అన్నారు. నిర్ణీత షెడ్యూల్ ను అనుసరిస్తూ ఆయా గ్రామాలలో అధికారులు ఉదయం నుండి సాయంత్రం వరకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో ప్రభుత్వపరంగా నిర్ణీత ప్రొఫార్మాలో ప్రింట్ చేసిన దర ఖాస్తులను అందజేయడం జరుగుతుందని అన్నారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తయిన అనంతరం క్షేత్రస్థాయి పరిశీలన, విచారణ కోసం వచ్చే రెవెన్యూ బృందాలకు సహకరించాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా రైతు గుర్తింపు కార్డుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ, హెల్ప్ డెస్క్, జనరల్ డెస్క్ ల వద్ద సదుపాయాలు, సిబ్బంది పనితీరును కలెక్టర్ పరిశీలన జరిపి, అధికారులకు పలు సూచనలు చేశారు. అర్జీలు సమర్పించేందుకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భూ సంబంధిత సమస్యలు ఉన్న వారు నిర్ణీత ప్రొఫార్మా లో సరైన విధంగా దరఖాస్తు చేసుకునేలా సహకారం అందించాలని హెల్ప్ డెస్క్ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, తహశీల్దార్లు సతీష్ రెడ్డి, శాంత, రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## ఘరానా దొంగల ముఠాను అరెస్టు చేసిన పోలీసులు






**- 15 తులాల బంగారు సొత్తు, వాహనాలు స్వాధీనం**
**- సిపి సాయి చైతన్య వివరాలను వెల్లడించారు**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
పరారీలో ముగ్గురు నిందితులు హైదరాబాద్ తో సహా వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడుతున్న ఘరానా దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 15 తులాల బంగారు సొత్తు, వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నిజామాబాద్ పోలీస్ కమిషన రేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నిజామాబాద్ సిపి సాయి చైతన్య వివరాలను వెల్లడించారు. ఇటీవల ఆరవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని వరుస చోరీలకు పాల్పడుతున్న కేసులపై విచారణ చేపట్టారు. హైదరాబాద్ కు చెందిన మహమ్మద్ అమీర్ అనే వ్యక్తి నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పలువురిని పరిచయం చేసుకొని చోరీలకు పాల్పడుతున్నట్లు సిసి ఫుటేజీ ఆధారంగా మహమ్మద్ అమీర్ ను అదుపులోకి తీసుకొని విచారించగా వరుస చోరీల సంఘటనలు తెలుగులోకి వచ్చాయన్నారు. నిజామాబాద్ ఏసిపి రాజా వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో పక్కా ప్రణాళికతో 8 మంది దొంగల ముఠాను అదుపులోకి తీసుకొని విచారించగా మొత్తం 24 దొంగతనాల కేసులు నిజామాబాద్ లో చేసినట్లు విచారణలో అంగీకరించినట్లు తెలిపారు. చోరీకి పాల్పడగా వచ్చిన సొత్తును షేక్ వసీం కు ఇచ్చేవారని అయినా తనకు పరిచయం ఉన్న మల్కాపూర్ కు చెందిన మోహన్ కు అమ్మేవాడని, అలా వచ్చిన నగదును అందరూ కలిసి పంచుకునేవారని సిపి తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో మొహమ్మద్ అమీర్ తో పాటు నిజామాబాద్ జిల్లాకు చెందిన మహమ్మద్ అబ్దుల్, షేక్ వాసిం,, సయాద్ రియాజ్, జావిద్ ఖాన్, షేక్ సోహెల్, ఎండి ఆసిఫ్, మాలోత్ మోహన్ లను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందన్నారు. మరో ముగ్గురు నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టామని వెల్లడించారు. వీరిలో షేక్ సోహెల్ గతంలో ఏడు కేసులలో నిందితుడిగా ఉన్నాడని ఇతనిపై హత్య కేసు కూడా ఉన్నట్లు తెలిపారు. అదేవిధంగా మొహమ్మద్ అమీర్ 21 నిందితుడుగా ఉన్నట్లు తెలిపారు. నిజామా బాద్, నిర్మల్,కామారెడ్డి, హైదరాబాద్ ప్రాంతాలలో మొత్తం 39 కేసులు ఈ ముఠా పై నమోదైనట్లు సిపి పేర్కొన్నారు. నిందితుల నుండి 15 తులాల బంగారం గొలుసులు, షిఫ్ట్ డిజైర్ కార్, పల్సర్ బైక్, హోండా షైన్ బైక్, ఫ్యాషన్ ప్లస్ బైక్ లను స్వాధీన పరుచుకున్నట్లు సిపి తెలిపారు. దొంగల ముఠా ను చాకచక్యంగా పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన సౌత్ రూరల్ సీఐ సురేష్ కుమార్, ఆరవ టౌన్ ఎస్ఐ వెంకట్రావు, తదితర సిబ్బందిని సిపి అభినందిస్తూ క్యాష్ రివార్డులను బహుకరించారు.

# స్వర్గీయ మాజీ ఎమ్మెల్యే కొమిరెడ్డి రాములకు ఘన నివాళి

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 03 :**
పుట్టిన కులానికి, నడిచిన మట్టికి వీర తిలకం దిద్ది బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవాన్ని దశ దిశల చాటిన మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ కొమిరెడ్డి రాములు జయంతిని పురస్కరించుకొని మంగళవారం ఆయన తనయులు, టిపిసిసి సీనియర్ నాయకులు కొమిరెడ్డి విజయ్ ఆజాద్ మెట్పల్లిలోని ఆయన నివాస కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తల మధ్య ఆయన చిత్రపటానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ మేరకు పట్టణ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంగు గంగాధర్ మాట్లాడుతూ.. ఆయన చేసిన సేవలను కొనియాడారు. సాధారణ రైతు కుటుంబంలో పుట్టి ఒక బీసీ బిడ్డగా బడుగు బలహీన వర్గాల నుండి ఈ ప్రాంతంలో ఒక బలమైన నాయకుడి గా ఎదిగారన్నారు. సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదిగా, చట్టసభల గురించి సంపూర్ణ అవగాహన ఉన్న రాములు.. న్యాయం కోసం తనను ఆశ్రయించిన ఎంతోమందికి న్యాయం చేశారని, తన సుదీర్ఘ రాజకీయ జీవితంలో అన్ని రంగాలలో వెనుకబడిన బడుగు, బలహీన వర్గాల సంక్షేమం






కోసం ఆయన శాసనసభ్యులుగా కొనసాగిన కాలంలో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చే ఎన్నో పథకాలు అమలుపరిచి అందరికీ లబ్ధి చేకూరేలా కృషి చేశారని, ఆయన సేవలు చిరస్మరణీయమని అన్నారు అనంతరం పార్టీ మాజీ మండల అధ్యక్షుడు ఎండి రైసోద్దిన్ ఆధ్వర్యంలో మల్లాపూర్ మండలంలోని రేగుంట వృద్ధాశ్రమంలో వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి స్వీట్లు పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మల్లాపూర్ మాజీ మండల అధ్యక్షులు కటకం గంగారెడ్డి, పార్టీ ఓ బి సి సెల్ జిల్లా జనరల్ సెక్రెటరీ బోయిన హనుమాన్లు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ తేజ, టిపిసిసి ఫిషరీస్ రాష్ట్ర కార్యదర్శి పల్లికొండ ప్రవీణ్, సీనియర్ న్యాయవాది వెలుముల రాంబాబు, ఓయూ జేఏసీ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాజా అజీమ్, షేర్ భరత్, ముత్యాల రమేష్, జబిడి రాజారెడ్డి, తాండ్ర నరసయ్య, కృష్ణమూర్తి, పొన్నాల ఎల్లేష్ విజయ్ పాటిల్, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేదంటే భారీ జరిమానాతో పాటుగా జైలుకు

**- సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ప్రకారం ఫోర్ వీలర్ వాహనాలకు బ్లాక్ ఫిల్మ్స్ నిషేదం**
**- టు వీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని**
**ట్రాఫిక్ ఏసిపి మస్తాన్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03**
నిజామాబాద్ నగరంలో ట్రాఫిక్ రూల్స్ పాటించని వారికి వినూత్నంగా పనిష్మెంట్ ఇస్తున్నారు ట్రాఫిక్ పోలీసులు. గత కొన్ని రోజులుగా రూల్స్ పాటించని వారికి భారీగా జరిమానాలు విధిస్తున్నారు. దీంతో ప్రజలు కొంత అసహనం వ్యక్తం చేశారు దీంతో సిపి సాయి చైతన్య ఆదేశాల మేరకు మొదట ప్రజల్లో అవగాహన తీసుకురా



వడం కోసం నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిచే ప్ల కార్డులు పట్టుకొని 30 నిమిషాల పాటు ప్రదర్శన చేయిస్తున్నారు. ప్రధానంగా యువత ట్రాఫిక్ నియమాలు పాటించడం లేదని పోలీసుల ఆరోపిస్తున్నారు. టు వీలర్ వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ తెలియ జేశారు. అలాగే కొందరు ఫోర్ వీలర్ యజమానులు ఇప్పటికీ కార్ల అద్దాల పైన బ్లాక్ ఫిల్మ్ వాడుతున్నారని ..సుప్రీంకోర్టు గైడ్లెన్స్ ప్రకారం ఫోర్ వీలర్ వాహనాలకు బ్లాక్ ఫిల్మ్స్ నిషేధించడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నియమాలు పాటించాలని లేదంటే భారీ చరిమానా తో పాటుగా జైలు కు కూడా పంపే అవకాశాలు ఉన్నాయని ఆయన అన్నారు. కమిషనర్ ఆఫ్ పోలీస్ సాయి చైతన్య వచ్చిన తరువాత నిజామాబాద్ నగరంలో పలు మార్పులు తీసుకొచ్చారు ట్రాఫిక్ రూల్స్ విషయంలో ప్రత్యేక దృష్టి సారించారు ప్రధానంగా యువతలో మార్పు తీసుకురావడం కోసం ఆయన కృషి చేశారు. టు వీలర్ వాహనాలకు భారీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లు బిగించిన వారిపై మొదట కొరడా జూలిపించారు. భారీ చరిమానాలు విధించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించని వారు భయపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పోలీసు వారు ప్రత్యేక నిర్వహించి డ్రైవ్ ల లో. జరిమాణాలు విధించడంతో ప్రజల నుంచి కొంత నిరసన ఏర్పడింది దీంతో మొదట ప్రజల్లో అవగాహన కల్పించాలని పోలీసులు నిర్ణయించారు. ఇందులో భాగంగానే ఈ అవేర్నెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు.

## నిర్మలానంద స్వామీజీ ఆశ్రమానికి నిప్పు పెట్టిన ఆగంతకులు

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**



మోపాల్ మండలం సిర్పూర్ గ్రామ శివారులోని 602 సర్వే నెంబర్లు అవధూత నిర్మలానంద స్వామి ఏర్పాటు చేసుకున్న ఆశ్రమానికి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. సోమవారం అర్ధరాత్రి ఆగంతకులు నిప్పు పెట్టి తగలబెట్టడం పట్ల స్వామీజీ భక్తజనం ఆందోళనకు గురవుతున్నారు. సంబంధిత భూమిని కబ్జా కోసమే ఈ దుశ్చర్యకు పాల్పడినట్లు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ దుశ్చర్యకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని స్వామీజీ భక్తులు మోపాల్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.

## మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ పై కేసు నమోదు

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**




రాష్ట్ర అవతరణ వేడుకల్లో భాగంగా డోర్నకల్ పట్టణ కేంద్రంలో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకుంది. డోర్నకల్ బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ శ్రేణులతో కలిసి గాంధీ బొమ్మ కూడలిలో కాంగ్రెస్ వేదిక మీదుగా ప్రదర్శన జరిపారు. తొలుత పోలీసుల సూచనలను అతిక్రమించి బీఆర్ఎస్ శ్రేణులు ముందుకు సాగి విధులకు ఆటంకం కలిగించినట్లు తెలిపారు. శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైనట్లు సీఐ రాజేష్ నాయక్ పేర్కొన్నారు. దీంతో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ తో సహా 17 మందిపై కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు ఆయన తెలిపారు. విచారణ అనంతరం మరికొంత మందిపై ఎఫ్ఐఆర్ నమోదయ్యే అవకాశం ఉన్నట్టు వెల్లడించారు.

## ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో స్వర్ణపతకం అందుకున్న రమ్యచంద్రిక గౌడ్

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
మహబూబాబాద్ జిల్లా కు చెందిన సీనియర్ జర్నలిస్ట్, సాక్షి దిన పత్రిక స్టాపర్ ఈరగాని బిక్షం కూతురు ఈరగాని రమ్యచంద్రిక గౌడ్ జవహర్ లాల్ నెహ్రూ టెక్నాలజీ యూనివర్సిటీ హైదరాబాద్(జెఎన్ టియు) లో యంఎస్సీ లో ఆర్గానిక్ కెమిస్ట్రీ విభాగంలో టాపర్ గా నిలిచి బంగారు పతకాన్ని సాధించింది. హైదరాబాద్ జెఎన్ టియు లో మంగళవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా బంగారు పతకాన్ని రమ్యచంద్రికాగౌడ్ అందుకున్నారు. బంగారుపతకం సాదించిన రమ్యచంద్రికాగౌడ్ ను టియుడబ్ల్యూజే య(ఐజేయు) మహబూబాబాద్ జిల్లాఅధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ అభినందించారు. మరిన్ని విజయాలు సాధిం చాలని ఆశీస్సులు అందజేసారు. ఈ సందర్భంగా సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ సీనియర్ జర్నలిస్ట్, సాక్షి దినపత్రిక మహబూబాబాద్ జిల్లా స్టాపర్ ఈరగాని బిక్షం గౌడ్



కుమార్తె రమ్యచంద్రికాగౌడ్ అత్యున్నత ప్రతిభ ప్రదర్శించి హైదరా బాద్ జెఎన్ టియు వంటి ప్రతిష్టాత్మకమైన విద్యాసంస్థలో, యంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ లో బంగారు పతకాన్ని సాధించడం అభినందనీయమన్నారు. జర్నలిస్ట్ ల పిల్లలకు రమ్యచంద్రికాగౌడ్ ఆదర్శనీయమని, ఆమెను స్ఫూర్తిగా తీసుకుని జర్నలిస్ట్ ల పిల్లలందరు శ్రద్ధగా చదవి మంచి ఫలితాలు సాధించాలని కోరారు.

## ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

**- ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ నగర సహాయ కార్యదర్శి కుశాల్**

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03**
అఖిల భారత విద్యార్థి సమైక్య ఏఐఎస్ఎఫ్ నిజాంబాద్ నగర సమితి ఆధ్వర్యంలో ఈరోజు ప్రభుత్వ పాఠశాలలను మౌలిక సదుపాయాలు కల్పించాలని నిజామాబాద్ నగర ఎంఈఓ అఫిస్ లో జూనియర్ అసిస్టెంట్ వినతి పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ నగర సహాయ కార్యదర్శి కుశాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఈ నెల 12 తేదీ నుండి రాష్ట్రవ్యాప్తంగా పునర్ ప్రారంభం అవుతున్న సందర్భంగా నిజామాబాద్ నగరంలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని అదేవిధంగా శిథిల వ్యవస్థలో ఉన్నటువంటి ప్రభుత్వ పాఠశాల భవనాలను నూతన




భవనాలు నిర్వహించాలని అదేవిధంగా ఖాళీగా ఉన్నటువంటి టీచర్ పోస్టులను భర్తీ చేయాలని దాంతోపాటు బుక్స్, యూనిఫామ్, మంచినీటి సౌకర్యాలు విద్యార్థులకు సరిపడా బాత్రూమ్స్ అన్నీ కూడా పాఠశాల ప్రారంభం కాకముందే పూర్తి చేయాలని కోరడం జరిగింది పై ఉన్నటువంటి సమస్యల్ని అన్ని వెంటనే పరిష్కారం చేయాలి. పరిష్కారం చేయకపోతే ఏఐఎస్ఎఫ్ అధ్వర్యంలో భవిష్యత్తులో ఆందోళన కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ముఖేష్ ,రమేష్ ,సాయి, వర్ధన్ పాల్గొన్నారు

# గంజాయి విక్రేత అరెస్ట్ - 1.2 కిలోల గంజాయి

**కరీంనగర్ రూరల్ (మన వెలుగు) జూన్ 03 :**
కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మరియు కరీంనగర్ రూరల్ ఏసీపీ శుభం ప్రకాష్ ఆదేశాల మేరకు, ఎస్ఐ కొత్తపల్లి సాంబమూర్తి ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది బృందం మంగళవారం మధ్యాహ్నం బావుపేట గ్రామంలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో గంజాయి విక్రేతను అరెస్టు చేసి, అతని వద్ద నుండి 1.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే, బావుపేట గ్రామంలోని రాంరెడ్డి చికెన్ సెంటర్ ఎదుట ఒక వ్యక్తి నల్లని పాలిథిన్ కవర్‌తో పారిపోవడానికి ప్రయత్నిస్తుండగా, పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. అతని చేతిలోని కవర్‌ను తనిఖీ చేయగా, అందులో గంజాయి వాసన కలిగిన పువ్వులు, మొగ్గలు లభించాయి. విచారణలో నిందితుడు తన పేరు రాంపర్వేష్ సాయిని (46), బీహార్ రాష్ట్రానికి చెందిన వాడినని తెలిపాడు. గత కొంతకాలంగా కూలీ పని నిమిత్తం బీహార్ నుండి బావుపేట గ్రామానికి వచ్చి గ్రానైట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు పేర్కొన్నాడు. ఇక్కడ




గంజాయి అలవాటు ఉన్నవారికి గంజాయిని విక్రయించి సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశ్యంతో బీహార్ వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తి వద్ద తక్కువ ధరకు గంజాయి కొని, ఇక్కడికి తీసుకువచ్చి చిన్న చిన్న ప్యాకెట్లుగా తయారు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 500 చొప్పున అమ్ముతున్నట్లు ఒప్పుకున్నాడు. ఈరోజు కూడా ఎవరికైనా అమ్మాలని అక్కడే నిలబడి ఉన్నట్లు తెలిపాడు. వెంటనే ఎస్ఐ సాంబమూర్తి ఇద్దరు ప్రభుత్వ పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి, నిందితుడి వద్ద ఉన్న గంజాయిని తూకం వేయగా సుమారు 1 కిలో 200 గ్రాముల గంజాయి ఉన్నట్లు తేలింది. స్వాధీనం చేసుకున్న గంజాయిని, నిందితుడి వద్ద ఉన్న సెల్ ఫోన్‌ను స్వాధీన పరుచుకొని, నిందితుడు రాంపర్వేష్ సాయినిని అదుపు లోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం కేసు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం కోర్టుకు రిమాండ్ తరలించనున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ గంజాయి పట్టుబడటంలో కీలకంగా వ్యవహరించిన సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్ఐ సాంబమూర్తి మరియు సిబ్బందిని సీపీ గౌస్ ఆలం, ఏసీపీ శుభం ప్రకాష్ అభినందించారు.

## ఫెర్టిలైజర్ దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు

**పినపాక (మన వెలుగు) జూన్ 03 :**
అశ్వాపురం: మండల లోని ఫెర్టిలైజర్ షాపులను మంగళవారం సీ ఐ అశోక్ రెడ్డి వ్యవసాయ శాఖ అధికారి మహేష్ చంద్ర చటర్జీ ఆకస్మిక తనిఖీ చేశారు. ఫెర్టిలైజర్ షాప్లలోని స్టాక్ రికార్డులు పరిశీలించి, స్టాక్ వివరాలు ఎప్పటికప్పుడు నమోదు




చేయాలని షాపు యజమానులకు ఆదేశించారు. పత్తి విత్తనాల నాణ్యతను పరిశీలించడంతో పాటు విత్తన డీలర్ల లైసెన్సులు తనిఖీ చేశారు. రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే తగిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## వేం పురుషోత్తం రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా నివాళి

**మహబూబాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి సోదరుడు వేం పురుషోత్తం రెడ్డి ద్వితీయ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగ్రామం మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం అర్పణపల్లి లోని వారి విగ్రహానికి మరియు, తండ్రి వేం చెన్న కృష్ణారెడ్డి విగ్రహాలకు కుటుంబ సభ్యులతో కలిసి పూలమా ల వేసి నివాళులు అర్పించారు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డిఈ కార్యక్రమంలో వారి



వెంట ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచందర్ నాయక్, మహబూ బాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్, మహబూబాబాద్ ఎంపి బలరాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ


**గొల్లపల్లి (మన వెలుగు) జూన్ 03 :**
గొల్లపల్లి మండలం శ్రీరాముల పల్లె గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ ధర్మపురి శాసనస భ్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మాజీ మంత్రివర్యులు జీవన్ రెడ్డి



అనంతరం విప్ మాట్లాడుతూ..డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ మహోత్సవంలో నన్ను భాగస్వాములను చేసినందుకు చాలా సంతోషంగా ఉందని,దేశంలో ఉన్న అన్ని వర్గాల వారికి సామాన్య యం,సమాన అవకాశాలు చేకూర్చే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందని, అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు మరువలేనివని,భారత రాజ్యాంగ శిల్పిగా, ప్రజా స్వామ్య పరిరక్షకునిగా, సంఘసంస్కర్తగా, మహామేధావిగా విఖ్యాతుడైన డాక్టర్ భీమ్‌రావ్ అంబేద్కర్ స్మృతికి నివాళులర్పిస్తూ, ఆ మహనీయునికి భారతరత్న అవా ర్డును ఇవ్వడం జరిగిందనీ,తెలంగాణ ఏర్పాటు కలను సాధ్యం చేసింది అంబేద్కర్ రాజ్యాంగమేననీ, ముందుచూ పుతో ఆయన రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్ 3 ద్వారానే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 7న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక

**నిజామాబాద్ ప్రతినిధి (మన వెలుగు) జూన్ 03 :**
ఈనెల 7న బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ (బ్యాట్) ఆధ్వర్యంలో వివిధ విభాగాల రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక నిజామాబాద్ నగర శివారులోని మోపాల్ లో ఫిటెనెస్ క్లబ్లో నిర్వహించ నున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు కర్నాటి వాసు, కె.వి కిరణ్ కుమార్, తెలియచేశారు. అండర్ - 17, అండర్ - 19 బాలురు, బాలికలు, అలాగే సీనియర్ పురుషులు, మహిళల రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలో ఎంపిక కోసం పోటీలు ఈనెల 7న నిర్వహించనున్నారని తెలిపారు. ఈ ఎంపిక కోసం ఎంట్రీ ల కోసం 9490815229, 9440007576 నంబర్ల కూ సంప్రదించ వలసిందిగా కోరారు.


94908 15229, 94415 85511
BADMINTON ASSN. NIZAMABAD DIST.
NIZAMABAD DISTRICT BADMINTON ASSOCIATION
(Registered under the Societies Registration Act. 2001, R.No. 333 of 2002)
KARNATI VASU
MBA, PGDPR
PRESIDENT
K.V. KIRAN KUMAR
General Secretary
Cell : 94400 07576
Dr. L. RAMULU, Vice President
M. BALAGANGADHAR (BDN), Vice President
Adv. M. SAYA REDDY, Treasurer
B. GANGADHAR GOUD, Joint Secretary
P. JAYA PRAKASH (BDN), Joint Secretary
R. MURALI, Joint Secretary
K. SRINIVAS GOUD, Organising Secretary
Executive Members :
J. HANUMANTH RAO
Dr. B. NAGARAJU
K. SRIKANTH
Er. K. VIJETHA
B. NARASIMHA
G. NAGARAJU
3-06-25
పత్రికా ప్రకటన
9490815229
9440007576.
General Secretary
Office : D.No. 6-18-65, "Ananda Nilayam", Near SFS School, Old NGO's Colony, Nizamabad.

## ప్రజా సమస్యల పరిష్కారానికి భూ భారతి

**- భూ భారతి ద్వారా ఏండ్ల నాటి సమస్య పరిష్కారం**
**- భూ భారతి కార్యక్రమంలో జువ్వాడి నర్సింగ్ రావు**

**మెట్ పల్లి (మన వెలుగు) జూన్ 03 :**
మెట్ పల్లి మండలం విట్టం పేట గ్రామంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న భూ భారతి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి వచ్చిన వినతుల స్వీకరించిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు



గారు అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ప్రజా అభివృద్ధి సంక్షేమం ద్యేయంగా కృషి చేస్తుందని గత ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి ద్వారా ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారని ఆ ఇబ్బందులను తొలగించేందుకు ప్రజా సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకువచ్చిందని భూ భారతి చట్టం ద్వారా ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్,మండల కాంగ్రెస్ అధ్యక్షులు అల్లూరి మహేందర్ రెడ్డి,తిప్పిరెడ్డి అంజిరెడ్డి,మాజీ జెడ్పిటిసి ఆకులలింగారెడ్డి,మండల రెవన్యూ అధికారులు,గ్రామ కార్యదర్శి ,చిరంజీవి ,రవీందర్ తదితరులు పాల్గొన్నారు




## ప్రభాస్ అభిమానులకు ఇక పండగే
## 16న రాజాసాబ్ టీజర్ విడుదల

ప్రభాస్ అభిమానులకు ఇక పండగే. త్వరలోనే శుభవార్త అంటూ వార్తలు వస్తున్నాయి. కథానాయకుడిగా మారుతీ దర్శకత్వంలో రూపొందుతున్న రొమాంటిక్ కామెడీ హారర్ ఫిల్మ్ 'ది రాజా సాబ్' భారీ అంచనాల మధ్య రానున్నది. ఈ మూవీ అప్‌డేట్ గురించి అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలో తాజాగా నిర్మాణ సంస్థ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ సినిమా టీజర్ జూన్ 16న రానున్నట్లు తెలిపింది. అలాగే డిసెంబర్ 5న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని వెల్లడిస్తూ ఓ పోస్టర్‌ను పంచుకుంది. ప్రభాస్ మొదటిసారి హారర్ నేపథ్యంలో ఉన్న కథలో నటిస్తుండటంతో అందరి దృష్టి 'ది రాజాసాబ్' పైనే ఉంది. మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధికుమార్, సంజయ్‌దత్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన వీడియోలు, పోస్టర్‌లు సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ దర్శకుడు మారుతీ పోస్ట్ పెట్టారు. 'మీ అందరకీ ప్రామిస్ చేసినట్లే మీరు కోరుకున్నట్లు- ప్రభాస్‌ను బిగ్‌స్క్రీన్‌పై చూస్తారు. ఆరోజు అభిమానులకు పండగే. మీలో జోష్ నింపేందుకు మరిన్ని అప్‌డేట్స్ రానున్నాయి' అని క్యాప్షన్ పెట్టారు. మారుతి - ప్రభాస్ కాంబోలో వస్తోన్న తొలి చిత్రమిది. తమన్ ఇప్పటికే ఈ సినిమాలో నాలుగు పాటలు పూర్తి చేసినట్లు ఆయన చెప్పారు. వైవిధ్యమైన థీమ్స్‌తో వీటిని డిజైన్ చేసినట్లు- వెల్లడించారు.

## పవన్ అభిమానులకు మరో శుభవార్త
# త్వరలోనే ఉస్తాద్ భగత్‌సింగ్ షూటింగ్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్‌కి టాలీవుడ్‌లో ఎంత క్రేజ్ ఉందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన సినిమాల కోసం అభిమానులు కళ్లల్లో ఒత్తులు వేసుకొని ఎదురు చూస్తుంటారు. అయితే రాజకీయాల వలన పవన్ కళ్యాణ్ సినిమాలు కాస్త తగ్గించాడు. దాదాపు రెండేళ్ల క్రితం మేనల్లుడు సాయి దుర్గా తేజ్ తో కలిసి 'బ్రో అనే చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చాడు. జూలై 28, 2023లో ఈ విడుదల అయ్యింది. ఆ తరువాత మళ్ళీ స్క్రీన్ మీద కనిపించలేదు పవన్. అయితే 'హరి హర వీరమల్లు'తో ఈ నెల 12న థియేటర్లలోకి రానున్నారు. మరోవైపు తాను కమిట్ అయిన ఓజీ చిత్ర షూటింగ్ కూడా శరవేగంగా జరిగేలా ప్లాన్స్ చేసుకున్నారు పవన్ .ఇప్పటికే ఓజీ చిత్ర రిలీజ్ డేట్ కూడా ప్రకటించారు. సెప్టెంబర్ 25న ఈ మూవీ ప్రేక్షకుల ముందుకు రానుందని ఇటీవలే పోస్టర్ ద్వారా తెలియజేశారు. ఇక పవన్ కమిటైన మరో చిత్రం ఉస్తాద్ భగత్ సింగ్. ఈ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా గమనిస్తూ వస్తున్నారు. ఎట్టకేలకి దీనిపై హరీష్ శంకర్ క్లారిటీ- ఇచ్చారు. కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని ప్రముఖ సినీ దర్శకుడు హరీశ్ శంకర్ మంగళవారం ఉదయం విఐపి విరామం సమయంలో దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. దర్శన అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదశీర్వచనం అందించగా... ఆలయ అధికారులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేసి పట్టు వస్త్రంతో




సత్కరించారు. ఆలయం వెలుపల మీడియాతో హరీశ్ శంకర్ మాట్లాడుతూ... జూన్ రెండవ వారంలో ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా షూటింగ్ ప్రారంభం కానుందని తెలియజేశారు. సినిమా షూటింగ్ ప్రారంభానికి ముందు స్వామివారి ఆశీస్సులు కోసం తిరుమలకు వచ్చామని హరీష్ తెలియజేయడంతో పవన్ అభిమానుల ఆనందానికి అవధులు లేవు. మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీప్రసాద్ సంగీతం అందిస్తున్న విషయం తెలిసిందే.

సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా ఒక స్పెషల్ అప్డేట్ ఉంటుందని నిర్మాత రవిశంకర్ ఇటీవల వివరణ ఇచ్చిన విషయం విదితమే.



## మా అఖిల్ పెళ్లికి రండి
## చంద్రబాబును ఆహ్వానించిన నాగార్జున

అక్కినేని అఖిల్ పెళ్లి పీటలు ఎక్కే సమయం ఆసన్నమైంది. జూన్ 6న అఖిల్ ఏడడుగులు వేయబోతున్నట్టు తెలుస్తుంది. ఈ క్రమంలో నాగార్జున తన కుమారుడి వివాహానికి పలువురు సెలబ్రిటీలని ప్రత్యేకంగా ఆహ్వానిస్తున్నారు. ఇటీవల తెలంగాణ సిఎం రేవంత్ రెడ్డిని కలిసి తన కుమారుడి వివాహానికి రావాలని ఆహ్వానించిన నాగార్జున తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని కలిసారు. ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో కలిసి తన చిన్న కొడుకు అఖిల్ వివాహానికి రావాల్సిందిగా చంద్రబాబును స్వయంగా ఆహ్వానించి వివాహ పత్రిక అందజేశారు. ఇక ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ని కూడా నాగార్జున ఆహ్వానించనున్నట్టు తెలుస్తుంది. గతేడాది నవంబర్ నెలలో అక్కినేని అఖిల్, జైనబ్ రవ్జీ అనే అమ్మాయితో నిశ్చితార్థం జరగగా,ఆ విషయాన్ని నాగార్జున తన సోషల్ మీడియా ద్వారా తెలియజేశారు. ఇక పెళ్లి ఎప్పుడు జరుగుతుందా అని అందరు ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేపథ్యంలో వారి వివాహం జూన్ 6న హైదరాబాద్ లోని అన్నపూర్ణ స్టూడియోలోనే జరగనున్నట్లు- సమాచారం. గతేడాది హీరో నాగచైతన్య, శోభితా ధూళిపాళ్ల వివాహం సైతం అదే స్టూడియోలో జరిగిన విషయం విదితమే. గతంలో అఖిల్.. శ్రియా భూపాల్ అనే యువతితో నిశ్చితార్థం జరుపుకున్నాడు. కాని పలు కారణాల వలన వారి బంధం పెళ్లి పీటల వరకు వెళ్లలేదు. ఇక కొన్నాళ్లుగా సింగిల్‌గా ఉన్న అఖిల్ జైనబ్ రవ్జీ అనే అమ్మాయితో ప్రేమలో పడ్డాడు. కొంతకాలంగా ప్రేమలో ఉన్న వీరిద్దరు ఇప్పుడు పెద్దల సమక్షంలో పెళ్లి పీటలు ఎక్కనున్నారు. జైనబ్ ప్రముఖ వ్యాపారవేత్త జుల్ఫీ రవ్జీ కుమార్తె. ఇక అక్కినేని అఖిల్ కొన్నాళ్లుగా మంచి హిట్ కోసం ఎదురు చూస్తున్నారు. లెనిన్ చిత్రంతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుండగా, ఈ చిత్రాన్ని కిశోర్ అబ్బూరు తెరకెక్కిస్తున్నారు.ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తుంది. మూవీపై అంచనాలు భారీగానే ఉన్నాయి.




## 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్

శేఖర్ కమ్ముల డైరెక్షన్ లో వస్తున్న కుబేర ప్రమోషన్లలో జోరు పెంచేశారు. నాగార్జున, ధనుష్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాపై అంచనాలు బాగానే ఉన్నాయి. ఇప్పటికే భారీ ఈవెంట్ కూడా నిర్వహించారు. ఈ సందర్భంగా మూవీ గురించి చాలా విషయాలను పంచుకున్నారు. తాజాగా మూవీ నుంచి 'కుబేర' నుంచి 'అనగనగా కథ' సాంగ్ ను రిలీజ్ చేశారు. ఇందులో నాగార్జున, ధనుష్‌పైనే సాంగ్ సాగుతోంది. ఈ పాట ఒకింత ఆలోచించే విధంగానే కనిపిస్తోంది. రెండు పాత్రల స్వభావాలను, వారి పరిస్థితులను ఇందులో వివరించబోతున్నారు. రష్మిక ఇందులో హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే వచ్చిన ట్రైలర్ బాగానే ఆకట్టు-కుంది. ఇందులో ధనుష్ పాత్ర ఇం-టె-స్టింగ్ గా ఉంది. శేఖర్ కమ్ముల సినిమా అంటేనే ఒకింత డిఫరెంట్ గా, భావోద్వేగాలను తట్టి లేపేవిగా ఉంటాయి. ఈ సారి కూడా అలాంటి భావోద్వేగాల నేపథ్యంలోనే మూవీని తెరకెక్కిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ సినిమా జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నాడు. అనగనగా కథ పాటను చంద్రబోస్ లిరిక్స్ అందించగా.. హైడ్ కార్తి, కరీముల్లా పాడారు. ఈ సినిమాలో నాగార్జున, ధనుష్ పాత్రలు చాలా డిఫరెంట్ గా ఉండబోతున్నాయి. వీరిద్దరి కాంబోలో వస్తున్న మొదటి మూవీ కావడంతో అటు తమిళంలో, ఇటు తెలుగులో ఆసక్తిని రేపుతోంది. వారం ముందు వీరమల్లు, వారం తర్వాత కన్నప్ప సినిమాలు రాబోతున్నాయి. అయినా సరే మూవీని భారీ పోటీ నడుమ రిలీజ్ చేస్తున్నారు.

## ఆ రోజు తెలుసు కదా!

సిద్ధు జొన్నలగడ్డ కథానాయకుడిగా తెరకెక్కుతున్న 'తెలుసు కదా' విడుదల ఖరారైంది. అక్టోబరు 17న చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నట్టు చిత్రబృందం సోమవారం ప్రత్యేకమైన వీడియోతో ప్రకటించింది. ఇందులో సిద్ధు జొన్నలగడ్డ సరసన రాశీ ఖన్నా, శ్రీనిధి శెట్టి నటిస్తున్నారు. నీరజ కోన దర్శకత్వం వహిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టి.జి.విశ్వప్రసాద్, టి.జి.కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. ఇద్దరిని ప్రేమించిన ఓ యువకుడి కథతో ఈ చిత్రం రూపొందుతున్నట్టు తెలుస్తోంది. "మనసుని తాకే భావోద్వేగాలతో, ఊహించని మలుపులతో సాగే కథ ఇది. దర్శకురాలిగా పరిచయం అవుతున్న నీరజ కోన తెలుగు సినిమాకి ఓ కొత్త వాయిస్‌ని అందించబోతున్నారు. దీపావళి ముందు రోజు వస్తున్న ఈ చిత్రం పండగ సంబరాల్ని రెట్టింపు చేస్తుంది. సిద్ధు జొన్నలగడ్డ మరో కొత్తతరం పాత్రతో ప్రేక్షకుల్ని అలరిస్తార"ని సినీ వర్గాలు చెప్పాయి. వైవా హర్ష కీలక పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: జ్ఞానశేఖర్ బాబా, సంగీతం: తమన్, కూర్పు: నవీన్

## అందాల ఆరబోతపై నెటిజన్ల ట్రోల్

ఘాటుగా సమాధానం ఇచ్చిన మాళవికా మోహనన్

ఈ రోజుల్లో అందాల ముద్దుగుమ్మలు గ్లామర్ షో చేయడం మనం చూస్తూనే ఉన్నాం. సినిమా ఆఫర్స్ తగ్గిన సమయంలో నిత్యం అందాలు ఆరబోస్తూ రచ్చ చేస్తున్నారు. అయితే గ్లామర్ షో సమయంలో కొందరు దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే ఓ ముద్దుగుమ్మని దారుణంగా ట్రోల్ చేయడంతో ఆమె ఇచ్చిన సమాధానం అందరిని ఆశ్చర్యపరిచింది. నేను ఒక్క దానినే అందాలు ఆరబోయడం లేదు.. మిగతా హీరోయిన్స్ కూడా అదే చేస్తున్నారంటూ కామెంట్ చేసింది. ప్రస్తుతం ఈ అమ్మడి కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మలయాళం, తమిళం, తెలుగు చిత్రాల్లో నటిస్తూ తన కంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మాళవిక మోహనన్ నెటిజన్ల ట్రోల్స్‌కు గట్టిగా సమాధానం ఇచ్చింది.2011లో మలయాళ సినిమా ద్వారా ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన ఈ మలయాళీ ముద్దుగుమ్మ ఇప్పటివరకు 60పైనే సినిమాల్లో కథానాయికగా, క్యారెక్టర్ ఆర్టిస్టుగా నటించి పేరు తెచ్చుకుంది. ఇటీవల ఈ భామ నటించిన రెండు మలయాళ చిత్రాలు తంకమణి , వన్స్ అపాన్ ఏ -టైమ్ ఇన్ కొచ్చి విడుదలై మంచి గుర్తింపును తీసుకువచ్చాయి. వరుస సినిమా ఆఫర్స్‌తో ఫుల్ జోరులో ఉన్న ఈ ముద్దుగుమ్మ అందాల వడ్డింపులో ఏ మాత్రం కాంప్రమైజ్ కావడం లేదు. తరచు తన గ్లామర్ షోతో రచ్చ చేస్తూనే ఉంటు-ంది. అయితే దీనిపై కొందరు నెటిజన్స్ ట్రోల్ చేశారు. అవకాశాల కోసమే మాళవిక అలా తన బాడీ చూపించుకుంటుందని కొందరు కామెంట్స్ చేశారు. దీని గురించి తాజాగా స్పందించిన మాళవిక మోనన్.. నేను ఎప్పుడు కూడా ఛాన్స్‌ల కోసం గ్లామర్ షో చేయలేదు. అయిన అందాలు చూపించడంలో తప్పేంటి. మలయాళ చిత్రాలలో ఎక్స్‌పోజ్ చేసే ఛాన్స్ ఉండదు. తెలుగు, తమిళ భాషలలోనే అలా నటించవచ్చు. ముఖం చూపించకుండా సోషల్ మీడియాలో నా గురించి రాసే వారిని నేను పట్టించుకోను. అయిన నేను ఒక్క దానినే గ్లామర్ ఫొటోలు షేర్ చేయడం లేదు, చాలా మంది హీరోయిన్స్ అలానే చేస్తున్నారు అని పేర్కొంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి.





## శేఖర్ కమ్ములకు పెన్ బహూకరించిన చిరు

దర్శకుడు శేఖర్ కమ్ములపై చిరంజీవి ప్రశంసలు కురిపించారు. ఆయన మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరుకున్నారు. పెన్నును బహుమతిగా ఇచ్చారు. తాను ఇండస్ట్రీకి వచ్చి 25 ఏళ్లు అయిన సందర్భంగా శేఖర్ కమ్ముల ఇటీవల చిరంజీవిని కలిసిన విషయం తెలిసిందే. కలలను వెంటాడితే విజయం తప్పకుండా మనల్ని ఫాలో అవుతుందని నమ్మకం ఇచ్చిన వ్యక్తి చిరంజీవి అని.. తన 25 ఏళ్ల ప్రయాణాన్ని ఆయన సమక్షంలో చేసుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆ ఫొటోలనే ఇప్పుడు చిరు షేర్ చేశారు. మీలాంటి అభిమానులు ఉండడం నాకూ ఆనందమే. మీ ప్రస్థానానికి నేను స్ఫూర్తినిచ్చానని తెలిసి మరింత సంతోషించాను. మీ 25 ఏళ్ల జర్నీలో నేనూ భాగమైనందుకు గర్వంగా ఉంది. సున్నితమైన వినోదంతో పాటు సందేశాన్ని జోడిస్తూ ఆలోచనాత్మకంగా తీసే మీ సినిమాలంటే నాకు ఎంతో ఇష్టం. ఫిల్మ్ మేకింగ్‌లో మీ కంటూ ప్రత్యేకతను క్రియేట్ చేసుకున్నారు. మీరు ఇలాగే మరో 25 ఏళ్లు జనరంజకమైన సినిమాలు తీస్తూ మరెన్నో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరుకుంటున్నాను అని చిరు తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక సినిమాల విషయానికొస్తే.. చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో బిజీగా ఉన్నారు. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన 'కుబేర' విడుదలకు సిద్ధంగా ఉంది. ధనుష్, నాగార్జున ప్రధానపాత్రల్లో నటించిన ఈ చిత్రం జూన్ 20న ప్రేక్షకుల ముందుకు రానుంది.